క్లుప్తంగా

కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

కొరిటిపాడు(గుంటూరు): అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. కార్గిల్ యుద్ధం పూర్వాపరాలు, వ్యూహాత్మంగా భారతీయ సైన్యం గెలుపు అనే అంశాలపై వీడియోను ప్రదర్శించారు. 'కార్గిల్ దివస్–దేశభక్తి'పై ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా ఎంబీఏ అమృత, ప్రవీణ్, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ నుంచి హర్ష వర్ధిని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్ని గెలుపొందారు. ఆద్యంతం ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి గీతాలాపన ముఖ్య అంశంగా నిలిచింది. అనంతరం విద్యార్థులు, అధ్యాపక బృందాలు కార్గిల్ వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి. రమణ, ఎంబీఏ హెచ్‌ఓడీ వి.చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కల్యాణి, అనిత, అభిలాష్, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాణిక్యరావుకు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగ పరిశోధకుడు కె. మాణిక్యరావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ ఆచార్య పి. కిరణ్మయి తెలిపారు. ఆయన న్యాయశాస్త్ర విభాగ పరిశోధనా పర్యవేక్షకులు శ్రీగౌరి పర్యవేక్షణలో ' హ్యూమన్ రైట్స్ ఇన్ లేబర్ జ్యూరిస్ ప్రుడెన్స్ – ఏ స్టడీ ఆన్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

ఆర్బీకేల ద్వారా ఎరువులు తెప్పించుకోండి

పెదకాకాని: ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా కేంద్రాల పరిధిలో అవసరమైన ఎరువులకు ఆర్డర్ చేయాలని గుంటూరు సబ్ డివిజన్ ఏడీఏ తోట కూర శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని రైతు భరోసా కేంద్రంలో బుధవారం వీఏఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది పెదకాకాని మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 4,363 మెట్రిక్ టన్నులు ఎరువులు రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆగస్టు మొదటి వారంలో ఈ క్రాఫ్ బుకింగ్ చేయాల్సి ఉంటుందని వీఏఏలు ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న రైతులు, పంట వివరాలు సేకరించి అందుబాటులో పెట్టుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 14వ విడత నగదు గురువారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈకేవైసీ 87 శాతం మాత్రమే పూర్తి అయిందని, పెండింగ్‌లో ఉన్న రికార్డులు కూడా వారం రోజుల్లో పూర్తి చేయాలని వీఏఏలకు సూచనలు చేశారు. త్వరలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (సీసీఆర్సీ) ఇచ్చే ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఎక్కువ మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి సంధ్యారాణి, ఏఈఓ రామమోహన్, వీఏఏలు పాల్గొన్నారు.

నల్లమడ వాగులో యువకుడి మృతదేహం లభ్యం



పెదనందిపాడు: నల్లమడ వాగులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కథనం ప్రకారం మండల పరిధిలోని నాగులపాడు గ్రామ సమీపంలో నల్లమడ వాగు వద్ద గుర్తు తెలియని 45 సంవత్సరాల యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారం పోలీసులు వాగులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుడిచేతిపై జి నరసమ్మ అనే పేరు పచ్చబొట్టు ఉన్నదని, వివరాలు తెలిసిన పెదనందిపాడు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలియజేశారు. వీఆర్వో జయప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

విజ్ఞాన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ దత్త గ్రామమైన చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరులోని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యుల బృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు కంటి రుగ్మతలు, కంటి శుక్లాలను ముందస్తుగా గుర్తించడం ఎలా అనే అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 110 మందికి అవసరమైన కళ్లజోళ్లు, మందులు అందించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యం–పరిసరాల పరిశుభ్రత మీద గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, శలపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండు రోజులుగా కుండపోత



వర్షం వస్తే ఇలా ఫీట్‌లు చేయాల్సిందే



బోసురోడ్డులో నీటితో నిండిన రోడ్డు

తెనాలిఅర్బన్: అల్పపీడనం కారణంగా తెనాలిలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో రోడ్లన్ని జలమయం అయ్యాయి. ఉదయం సమయంలో పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు అందరు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సాయంత్రం అయిన వర్షం తగ్గకపోవడంతో చిరువ్యాపారులు అవస్తలు పడాల్సి వచ్చింది. వర్షంతో పాటు చిరుగాలులు కూడ కొంత వీచాయి. దీంతో బోసురోడ్డు, మెయిన్ రోడ్డు, బుర్రిపాలెం రోడ్డు, గాంధీచౌక్ వంటి ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. వర్షం నీటిలోనే వాహనదారులు, ప్రజలు వెళ్ళాల్సి రావడంతో కొంత అసౌకర్యానికి గురి అయ్యారు.



జలమయం అయిన రోడ్డు



వర్షం నీటిలో అవస్థలు పడుతున్న వాహనదారుల

తెనాలి డివిజన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు...

తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో బుధవారం కొల్లిపర మండలంలో అత్యధికంగా 80.2 మీల్లి మీటర్ల వర్షం కురవగా కాకుమానులో అత్యల్పంగా 23.6 మీ.మీ వర్షపాతం నమోదు అయిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. తెనాలి డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఈవిధంగా ఉన్నాయి. చేబ్రోలు–45.4, దుగ్గిరాల–50.8, మంగళగిరి–47.2, పొన్నూరు–32.8, తాడేపల్లి–49.6, తెనాలి–25.2 మీ.మీ వర్షపాతం నమోదైంది.

ఎస్టీ కుటుంబాలకు బియ్యం కూరగాయల పంపిణీ

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామం వెలుపల పశ్చిమడెల్టా కొమ్మమూరు కాల్వ కట్టపై నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు సినీదర్శకుడు దిలీప్ రాజా బుధవారం సాయంత్రం బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. గత కొద్దిరోజులుగా విడవకుండా కురుస్తున్న వర్షాలకు, వారంతా గుడిసెల్లోనే ఉండిపోయారని తెలిపారు. దీంతో ఆ కుటుంబాలకు రోజువారీ ఆహారానికి ఇబ్బంది రాకుండా ఉండాలని చిరుసాయం చేసినట్లు దిలీప్‌రాజా తెలిపారు.



బియ్యం, కూరగాయలు అందజేసిన దిలీప్‌రాజా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తత చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఫ్యామిలీ హెల్త్ వెల్‌నెస్ ప్రోగ్రాం కింద గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరీనాబేగంను వివరాలు అడిగారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలోని మందులు, ఓపీ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోని హాలులో ఆరోగ్యసిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్‌సీడీసీడీ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, బర్త్ ప్లానింగ్ వంటివాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు వివరించారు. ప్రతినెలా ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తామని, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రత్నమన్‌మోహన్, వైద్యాధికారులు ఫరీనాబేగం, యానీగ్రేస్, ఎస్తేరురాణి, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణంతో మెరుగైన సేవలు..



సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలోని స్థలాన్ని బుధవారం అధికారులతో కలిసి ఎ.శ్రావణ్‌బాబు పరిశీలించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ మాట్లాడుతూ పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. ఆయన వెంట జిల్లా ఉప వైద్యాఆరోగ్యశాఖాధికారి రత్నమన్‌మోహన్ ఉన్నారు.

'అంజుమన్' ఎన్నికల్లో ఇస్లామిక్ ఫ్రంట్ ఘనవిజయం

తొమ్మిది స్థానాలకు గానూ ఏడు స్థానాల్లో గెలుపు

మంగళగిరి: అంజుమన్ ట్రస్ట్‌బోర్డు ఎన్నికల్లో ఇస్లామిక్ ఫ్రంట్ ఘన విజయం సాధించింది. మొత్తం తొమ్మిది స్థానాలకు గానూ ఏడు స్థానాల్లో ఇస్లామిక్ ఫ్రంట్ అభ్యర్థులు గెలుపొందగా మరో రెండు స్థానాల్లో ఇటీవల నూతనంగా ఆవిర్భవించిన ముస్లిం యువసేన అభ్యర్థులు గెలుపొందారు. నగరంలోని సీకే జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం రాత్రి అంజుమన్ ట్రస్ట్‌బోర్డు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించారు. పటిష్ట పోలీస్ బందోబస్తు నడుమ కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. ఓ పక్క వర్షం కురుస్తూనే ఉన్నా మరో పక్క కౌంటింగ్ హాల్లో ఉత్కంఠ కొనసాగుతూనే వచ్చింది. ఎన్నికల బరిలో ముస్లిం యువతరం, ముస్లిం ఫ్రంట్, ఇస్లామిక్ ఫ్రంట్, ముస్లిం యువసేన నిలవగా ఇస్లామిక్ ఫ్రంట్ ఘన విజయం సాధించింది. ఈనెల 23వ



ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్

తేదీన అంజుమన్ ట్రస్టు బోర్డు ఎన్నికలు నిర్వహించారు. ఇస్లామిక్ ఫ్రంట్ తరపున బరిలో నిలిచిన ఏడుగురు అభ్యర్థులు విజయం సాధించగా ముస్లిం యువసేన నుంచి ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించారు. ఇస్లామిక్ ఫ్రంట్ నుంచి షేక్ అక్బర్ బాషా, షేక్ అబ్దుల్ సలీమ్, షేక్ యాసిన్, షేక్ అలీ, షేక్ అబ్దుల్ సలీమ్, షేక్ హనీఫ్ షా ఖాదరీ, షేక్ హఫీజ్ (బద్రి) లు విజయం సాధించారు. ముస్లిం యువసేన నుంచి షేక్ అక్రమ్, షేక్ అబుజలి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి అస్గర్ అలీ తెలిపారు. ఎన్నికల అనంతరం విజయం సాధించిన ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

మణిపూర్ క్రైస్తవులకు భద్రత కల్పించాలి

తాడేపల్లిరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని నిలువరించాలని కోరుతూ బుధవారం కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వద్ద నుంచి తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలువరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, గ్యాంగ్ రేప్‌లు చేసి చంపేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎం.జాన్ డగ్లస్, ప్రెసిడెంట్ ఎస్.జోసఫ్, సెక్రటరీ సీహెచ్ డేవిడ్ గాంధీ, మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.రవిప్రకాష్, సీడబ్ల్యూపీఎఫ్ పి.సహదేవ్, ప్రజానాట్యమండలి నాయకులు జగన్, కొట్టె కరుణాకర్, ఐద్వా నేతలు గిరిజ, ఉష తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

ముమ్మరంగా ఓటు నమోదు పక్రియ

జంపని(వేమూరు): కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఓటు నమోదు పక్రియ ముమ్మరం చేశారు. వేమూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారుల ఓట్లు నమోదు పక్రియ ప్రారంభించారు. జంపని గ్రామంలో వీఆర్వోలు ఓట్లు నమోదు, తొలగింపుపై సర్వే ముమ్మరంగా చేస్తున్నారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన బూత్ లెవల్ అధికారులు సర్వే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

కాల్వల్లో తూటికాడ తొలించాలని వినతి

తెనాలి: పంటకాల్వలు, మురుగు కాల్వల మరమ్మతులను, కాల్వల్లో తూటికాడ తొలించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటచేలు చెరువులుగా మారాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి రూరల్ మండలంలో 17 వేల ఎకరాలకు గాను కేవలం రెండు వేల ఎకరాల్లోనే ఇప్పటికి వెద సాగు చేశారని, కొల్లిపర మండలంలో 15,500 ఎకరాలకు 6,500 ఎకరాల్లోనే సాగయిందని వివరించారు. చేలల్లో నిలిచిన నీరు బయటకు పోయేందుకు పదిరోజులు పడుఉందనీ, రైతాంగం వద్ద విత్తనాలు లేక, నారు లేక ఆందోళన పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన యంత్రాలతో గుర్రపుడెక్క, తూటాకును తొలగించాలని కోరారు. ఏపీ సీడ్స్ ద్వారా రైతాంగానికి విత్తనాలు, వరినారు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రేపు కానుకల లెక్కింపు

చేబ్రోలు: పట్టణంలో ప్రఖ్యాతి గాంచిన సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను శుక్రవారం ఉదయం లెక్కించనున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ కార్యనిర్వహణాధికారి తుల్లిమిల్లి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పట్టణంలోని సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మొత్తం ఆరు దేవాలయాలున్నాయి. దేవస్థానాలలో మొత్తం 20 హుండీలు ఉన్నాయి. 28వ తేదీ ఉదయం 9 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని తుల్లిమిల్లి శ్రీనివాస్ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

గుంటూరు ఈస్ట్: సెంట్రింగ్ కార్మికుడు భవనం పైనుంచి కిందపడి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తాడికొండ మండలం తాతిరెడ్డిపాలేనికి చెందిన కఠారి అశోక్ (33) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వికాస్‌నగర్ 3వ లైనులో నిర్మాణంలో ఉన్న భవనంలో బుధవారం పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పేకాట ఆడుతున్న ముగ్గురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేటలోని ఓ లాడ్జిలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 9వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరకు నిప్పంటుకుని మహిళ మృతి

పిట్టలవానిపాలెం: చీరకు నిప్పంటుకుని మహిళ మృతిచెందిన దుర్ఘటన మండలంలో చోటు చేసుకుంది. పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామానికి చెందిన బోలె శ్రీలక్ష్మి(27) మహిళ ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పు అంటుకుని అగ్నికి కాలిపోయింది. స్థానికులు గమనించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం వైద్యశాలలో మృతి చెందినట్లు చందోలు ఎస్ఐ ఎస్.రాజశేఖర్ తెలిపారు.

కంప్యూటర్ స్కిల్స్ అందిపుచ్చుకోవాలి

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్సు ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా కంప్యూటర్స్ ఫండమెంటల్స్ అనే అంశంపై స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా గుంటూరు కేఆర్ఎస్ఎల్ కంప్యూటర్ సైన్సు అధ్యాపకురాలు వి.సునీత విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ స్కిల్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ స్కిల్స్‌ను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ముఖ్యఅతిథి సునీతను కళాశాల తరపున శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, కంప్యూటర్ అధ్యాపకులు సోమయాజులు ఉన్నారు.

ప్రజా సమస్యలను సహనంతో పరిష్కరించాలి

రేపల్లెరూరల్: సమస్యలపై వచ్చిన ప్రజలకు సహనంతో సేవలను అధికారులు అందించాలని సీఐ నజీర్‌బేగ్ అన్నారు. మండలంలోని పేటేరు సచివాలయ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. గ్రామీణుల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉంటారని, అటువంటి వారు కేంద్రాలకు వస్తే సహనంతో సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు.

పంట పొలాల్లోకి చేరిన వర్షం నీరు

తెనాలిటౌన్ : ఇటీవల కురుస్తున్న భారీ వర్షానికి మాగాణి భూముల్లో వరిపైరు, మెట్ట భూముల్లో సాగులో ఉన్న వాణిజ్య పంటలు అరటి, పసుపు నీట మునిగాయి. ఆకుకూరలు గోంగూర, కొత్తిమీర, పొదిన పంటలు వర్షం నీటికి మునిగాయి. పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. తెనాలి రూరల్ మండలంలో ఇప్పటి వరకు సుమారు మూడు వేల ఎకరాల్లో వెద పద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. అకాల వర్షానికి పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట పొలాల్లో సాగు చేస్తున్న ఆకు కూరలు సైతం వర్షానికి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. వర్షం ఆగక పోతే ఎక్కువ స్థాయిలో నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎరుకులపూడిలో ఆకుకూర తోటలో నిల్వ ఉన్న వర్షం నీరు

పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోండి

తెనాలిఅర్బన్: కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువస్తోందని ఎన్‌సీఆర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మహ్మద్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ శిక్షణను రెండొవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక తరగతుల పాఠ్యపుస్తకాల సిలబస్‌లను మార్పు చేయడం జరిగిందన్నారు. వాటిపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు నిపుణులు వివిద పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో సీఆర్ఎంటీ సీహెచ్ శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయుల

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి

తెనాలి: చేనేత బాంధవుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య జయంతిని బుధవారం పట్టణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ప్రగడ కోడయ్య నగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేనేతల అభివృద్ధికి కోటయ్య చేసిన కృషిని, చేనేత కాలనీల ఏర్పాటును సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు స్మరించుకున్నారు. ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. బీసీ నాయకులు పోలిశెట్టి వెంకటేశ్వరరావు, కొడాలి శ్రీనివాసరావు, కొడాలి క్రాంతికుమార్, గోలి లక్ష్మీనారాయణ, జొన్నాదుల గోపి, జె.కృష్ణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రగడ కోటయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న స్థానికులు

అందరికీ న్యాయవ్యవస్థ గురించి తెలియాలి

- సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జి.చంద్రమౌళేశ్వరి
- కిట్స్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

గుంటూరు రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయవ్యవస్థ గురించి తెలియజేయాలని న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించటం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జి.చంద్రమౌళేశ్వరి తెలిపారు. బుధవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కిట్స్ కళాశాలలో విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ప్రధానమైన భాగంగా పరిగణించబడతారన్నారు. ప్రధాన భాగమైన విద్యార్థులు తెలిసి తెలియక కొంతమంది అపరాధాలు చేసి వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులకు లోక్ అదాలత్, భారతీయ చట్టాలను వివరించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పీవీ రాంబాబు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు చేసే అపరాధాలు వాటికి చట్టపరంగా పడే శిక్షలు వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు ఏవిధంగా చట్టాలు సహాయం అందిస్తున్నాయో తెలిపారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలని వాళ్ళ జీవితాలను క్షణకాలంలో చేసే ఆలోచనల మూలంగా జీవితాలు ఏవిధంగా నాశనమవుతున్నాయి వివరించారు. ర్యాగింగ్ తదితర అపరాధాలు చేసి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, కె.చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌలేశ్వరి తదితరులు

లోన్ మంజూరు పేరుతో ఆన్‌లైన్‌లో మోసం

పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ

పెదకాకాని: రుణం మంజూరు చేస్తామని ఆన్‌లైన్‌లో నమ్మించి మోసం చేయడంపై పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం గడ్డిపాడులో నివాసం ఉంటున్న చింతకాయల శివనంది ఆన్ లైన్‌లో ముద్ర అసోసియేట్స్ పేరుతో ఉన్న సంస్థకు ఫోన్ చేసి లోన్ గురించి వివరాలు అడిగింది. కొంతసేపటి తర్వాత ముద్ర అసోసియేట్స్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి లోన్ ఇస్తామని నమ్మబలికారు. లక్ష రూపాయలు రుణం ఇస్తామని ముందుగా ఫీజ్ చెల్లించాలంటూ ఆమె వద్ద నుంచి 2250 రూపాయలతో మొదలుపెట్టి దశల వారీగా 1,03,500 ఫోన్ పే చేయించుకున్నారు. అడ్రస్ ప్రూఫ్స్ పంపించాలని అడుగుతూనే మళ్లీ నగదు ఫోన్ పే చేయాలని కోరడంతో అనుమానం వచ్చి వేరే వారిని విచారించింది. ముద్ర అసోసియేట్స్ అనేది మోసపూరిత సంస్థని వారు చెప్పడంతో మోసపోయానని గ్రహించి పెదకాకాని పోలీసులు ఆశ్రయించింది. బాధితురాలు చింతకాయల శివనంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున నగర పరిధిలోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ యు శారదాదేవి విజ్ఞప్తి చేశారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగి పడే ప్రమాదం పొంచి ఉందని, అటువంటివి గుర్తిస్తే వెంటనే నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ 7093912653 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. మరీ ముఖ్యంగా విలీన గ్రామాల పరిధిలో చెరువులు, వాగులు కోతకు గురి అయ్యే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు, టెస్టులు హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీరు తాగాలని కమిషనర్ శారదాదేవి సూచించారు.